క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం


కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ

వీరవాసరం: వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా తిరిగి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశాఖపట్నంలో ప్రమాణ స్వీకారం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. జగన్ గత ఐదేళ్లలో అందించిన సంక్షేమ పథకాల లబ్ధి పొందిన ప్రజలే ఆయనకు మద్దతుగా నిలిచారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ప్రకంపనలు కనిపిస్తున్నాయని చెప్పారు. ముఖ్య సర్వేలన్నీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి అధికారం చేపడతారని చెబుతుండడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి నిరంతరం కృషి చేసిన సీఎం జగన్‌కు అన్ని వర్గాల ప్రజలు బాసటగా నిలిచారని చెప్పారు. జగన్ తిరిగి అధికారం చేపట్టి మరింత మంది ప్రజలకు అభివృద్ధిని, సంక్షేమాన్ని అందించడం ఖాయమని వివరించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


భీమవరం: విద్యార్థులకు వ్యాసరచన పోటీల దృశ్యం

భీమవరం: స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. టీచర్ జి.గంగాధర్ పర్యవేక్షణలో ఈ పోటీల్లో ఏర్పాటుచేశారు. విద్యార్థులకు గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో క్యారమ్స్, చెస్‌లో, డ్యాన్స్ మాస్టర్ జె.శ్యామ్ నృత్యంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది వి.సోమరాజు, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు సిద్ధం


మొగల్తూరులోని స్టాక్ పాయింట్‌కు చేరిన పుస్తకాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

మొగల్తూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధమవుతున్నాయి. పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో సంబంధిత విద్యాశాఖాధికారులు కృషి చేస్తున్నారు. జూన్ 12న పాఠశాలలు ప్రారంభం కానుండటంతో 8వ తేదీ నాటికే పాఠ్యపుస్తకాలు అందించేందుకు సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగానే మండలంలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సుమారు 46,150 పాఠ్యపుస్తకాలకు ఇండెంట్ పెట్టగా, మొదటివిడతగా ఇప్పటివరకు 27,585 పుస్తకాలు వచ్చాయని ఎంఈవో శామ్యూల్ జాన్ సోమవారం తెలిపారు. వచ్చిన పుస్తకాలను మొగల్తూరులోని పెన్మత్స రంగరాజు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్ తరలించారు. మిగిలిన పుస్తకాలు కూడా త్వరలో రానున్నాయని, పాఠశాలలు పునః ప్రారంభం కావడానికి ముందుగానే ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తామని, అలాగే బ్యాగ్‌లు 4,843, డిక్షనరీలు 879 రావాల్సి ఉండగా, బెల్ట్‌లు మాత్రం 3,272 వచ్చాయన్నారు.

పేద విద్యార్థికి సైకిల్ అందజేత


పేద విద్యార్థికి సైకిల్ అందజేస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని బీవీఆర్‌ఎం బాలికల మునిసిపల్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గీతా భవాని అనే పేద విద్యార్థినికి సోమవారం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రూ.7వేలు విలువైన కొత్త సైకిల్‌ను అందజేశారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా క్షీరపురి యోగా సత్సంగం సభ్యుల సమక్షంలో క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు విరాళంతో ఈ సైకిల్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, యోగా కేంద్ర నిర్వాహకుడు జవ్వాజి కల్యాణ్, పూర్వ గవర్నర్ ఆకి రామకృష్ణ, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, మానెం బసవరాజు, తెలుగు ఉపాధ్యాయిని బిక్షాపతి, యోగా సభ్యులు పాల్గొన్నారు.

ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ

మొగల్తూరు: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్న నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మండలంలోని పలువురు వ్యాపారులు, మధ్యతరగతి వారు కూడా ఫలనా పార్టీ గెలుస్తుందంటూ అంచనాలు వేస్తున్నారు. ఎగ్జిట్ పోల్ సర్వే ఫలితాలు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా రావడంతో పందెం రాయుళ్లలో అలజడి నెలకొంది.

ఇంటి వద్దకే వైద్య సేవలు

- పేదల పాలిట వరంగా మారిన ఫ్యామిలీ డాక్టర్
- ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో వైద్య సేవలు


రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు


బొండాడ గ్రామంలో వృద్ధురాలికి వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు సునీల్

కాళ్ల: జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వినూత్నమైన కార్యక్రమం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వైద్య సేవలు అందుతున్నాయి. వైద్య సేవలు పొందాలంటే మండల కేంద్రమైన ప్రభుత్వాసుపత్రికో లేదా సబ్ సెంటర్లకు వెళ్లాల్సి వచ్చేది. కానీ ప్రతి పేదవాడికి వైద్యం అందజేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలోను ప్రతి ఇంటికి వెళ్లి వైద్యులు వైద్య సేవలు అందజేస్తున్నారు. గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఉదయం పూట ఆయా గ్రామాల్లో సచివాలయాలు, పంచాయతీల వద్ద ఓపి కార్యక్రమంలో భాగంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా వైద్య సేవలు అందజేస్తున్నారు. గర్భిణులు బీపీ, సుగర్ వంటి దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరిస్తున్నారు. అదేవిధంగా దీర్ఘకాల వ్యాధులతో మంచం మీద ఉన్న వ్యాధిగ్రస్తులను వారి ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందజేస్తున్నారు. అంతేకాకుండా వైద్య సేవలు పొందిన వారిని ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందజేస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా 60 నుంచి 100 మంది రోగులను పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్య సేవ అందజేస్తున్నారు. నెలకు 26 క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఒక్కొక్క ఊరికి రెండు నుంచి మూడు వరకు క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కాళ్ల ప్రభుత్వ వైద్యాధికారి సరాబు సునీల్ తెలిపారు. దీనిలో భాగంగా సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు వైద్య సేవలు, వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు గుండె సమస్యతో బాధపడుతున్న వృద్ధురాలకి వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యాధికారి సునీల్ తగు జాగ్రత్తలు తెలియజేశారు. కాళ్ల ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలో వైద్యులు వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు ఆధ్వర్యంలో ఉన్న 21 గ్రామాలలో ప్రజలకు వైద్య సేవలు అందజేస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో వైద్యులే ఇంటింటికి వచ్చి వైద్య సేవలు అందజేయడంతో ఆయా గ్రామల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిభను ప్రోత్సహించడం సామాజిక బాధ్యత

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రతిభను ప్రోత్సహించడం సామాజిక బాధ్యతని మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల అన్నారు. ఇంటర్ విద్యలో ప్రతిభ వంతులకు శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో ప్రతిభ పురస్కారాలను అందజేశారు. కమిషనర్ శ్యామల మాట్లాడుతూ భీమవరం సీఎస్‌ఎన్ విద్య సంస్థల్లో పేద విద్యార్థుల విద్యకు ఉచితంగా ఫీజులు చెల్లించడం, వారు విద్యలో ముందుండడం గొప్ప విశేషమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సీఎస్‌ఎన్ జూనియర్ కళాశాలలో 2023–24లో ఇంటర్‌లో విద్యార్థులు బి.వరలక్ష్మి 464, సాయి మౌనిక 481, జి.నవ్య 477 మార్కులు, మిగిలిన వారికి 450కు పైగా మార్కులు సాధించారని, వీరందరికీ కమిషనర్ శ్యామల చేతుల మీదుగా పురస్కారాలను అందించామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ చీడే సత్యనారాయణ, కోశాధికారి వడుపు గోపి, అరసవల్లి సుబ్రమణ్యం, పట్టణ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేసుల్లో ఇరుక్కుని భవిష్యత్ నాశనం చేసుకోవద్దు

యలమంచిలి: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనున్న నేపథ్యంలో అన్ని గ్రామాల్లో సెక్షన్ 144 సీఆర్‌పీసీ, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్, ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని ఎస్సై కాకి శివనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెక్షన్లు అమలులో ఉన్న సమయంలో నలుగురికి మించి ఒకచోట గుమికూడరాదన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా కాల్చడం, బైక్ ర్యాలీలు చేయడం, మోటార్ సైకిల్ సైలెన్సర్ తీసి నడపడం వంటివి చేయకూడదన్నారు. ఎన్నికల్లో ఓడిన వారిని కించపరిచే విధంగా లేదా వారి మనోభావాలు దెబ్బతినేలా అభ్యంతరకర పోస్టులను సోషల్ మీడియాలో పెట్టరాదన్నారు. ముఖ్యంగా రాజకీయ నాయకులు, కార్యకర్తలు గమనించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. యువత ఎలక్షన్ కేసుల్లో ఇరుక్కుని భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం


ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాలలో నియోజకవర్గ ఓట్ల లెక్కింపుకు సర్వం సిద్ధం చేసిన దృశ్యం

ఉండి: సార్వత్రిక ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమని సజావుగాను, పారదర్శకంగాను, పటిష్ఠంగాను నిర్వహించేందుకు లెక్కింపు కేంద్రంలో నిరంతర నిఘా కెమెరాలు, ప్రత్యేక భద్రతాచర్యలతో సర్వం సిద్ధం చేసినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య తెలిపారు.

వైఎస్సార్ సీపీకి అధికారం ఖాయం


రాయకుదురులో అమ్మవార్లకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

వీరవాసరం: వైఎస్సార్ సీపీ తిరిగి అధికారం చేజిక్కించుకోవడం ఖాయమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. వీరవాసరం మండలం రాయకుదురు శ్రీ మావుళ్లమ్మ, మహాలక్ష్మి, పోతురాజు స్వామి వార్ల ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఆలయంలో పూజలు చేశారు. మావుళ్లమ్మ, మహాలక్ష్మమ్మ, పోతురాజు స్వామి వార్ల ఆశీస్సులు ప్రజలందరి పైనా ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని శ్రీనివాస్ ఆకాంక్షించారు. కొణితివాడలో వేంచేస్తున్న శ్రీ వేణుగోపాల స్వామివారి ఆలయంలో శ్రీనివాస్ పూజలు చేశారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొలగాని సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ మానుకొండ ప్రదీప్ కుమార్, నాగరాజు వెంకట శ్రీనివాసరాజు, గన్నవనీడి బాబ్జీ, తాడాల దుర్గా వర ప్రసాద్, నాగరాజు వెంకట గోపాలకృష్ణంరాజు, వై.మధు రాజు, వై.వెంకట్రామరాజు, ఎన్ సత్యనారాయణ రాజు, గోపాలకృష్ణ, అడబాల రామకృష్ణుడు, సింహాద్రి సాయి రాజేష్, కాకిలేటి బాసు, మారెళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో రోగులకు ఏసీ సౌకర్యం


స్థానిక సీహెచ్‌సీలో రోగులకు ఏసీ సౌకర్యం కల్పించిన దృశ్యం

ఆకివీడు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం(30 పడకల ఆస్పత్రి)లో ఏసీ సౌకర్యాన్ని పునరుద్దరించారు. ఇటీవల ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన వైద్యురాలు ఎండీ. అజ్మీనా నజ్రీన్ గర్భిణీలు, బాలింతల ఇబ్బందుల్ని చూసి తక్షణం రెండు ఏసీలను బాగుచేయించి అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో జనరల్ వార్డుల్లో ఏసీ సౌకర్యం కల్పించడంతో రోగులు, బాలింతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండుటెండల్లో పసికందులు, బాలింతలు పడుతున్న ఇబ్బందుల్ని చూసి, వైద్యురాలు నజ్రీనా తీసుకున్న చర్యల్ని పలువురు అభినందిస్తున్నారు. వార్డులో ఫ్యాన్లు కూడా పూర్తి స్థాయిలో తిరుగుతున్నాయి. దాతలు ఇచ్చిన ఏసీలను గతంలో మూలన పడవేశారు. మరమ్మతులకు గురైతే వాటిని పట్టించుకునే నాథుడేలేడు. రోగులు, బాలింతలు విసినికర్రలతోనూ, తవల్, పవిట చెంగులతో విసురుకుని సేదతీర్చుకునేవారు. ఆ దుస్థితి నుంచి ఆస్పత్రిలో మెరుగైన సేవలందిస్తున్నారు. దీంతో ఆస్పత్రులకు వెళ్లేందుకు రోగుల సంఖ్య కూడా ఇటీవల కాలంలో పెరిగింది. ఆస్పత్రిలో పలు ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని రోగులకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

ఉప్పునీటితో చనిపోతున్న గుర్రపుడెక్క


ఉప్పుటేరులో సముద్రపు నీరు ప్రవేశించడంతో చనిపోతున్న గుర్రపుడెక్క

ఆకివీడు: ఉప్పుటేరును ఆవరించిన గుర్రపుడెక్క సముద్రపు నీటికి చనిపోతుంది. పశ్చిమ, కృష్ణా డెల్టాలకు చెందిన వివిధ పంట, మురుగు కాల్వల నుంచి వ్యర్ధనీరు ఉప్పుటేరులోకి చొచ్చుకుపోతుంది. నీటితో పాటు కాలువల్లో ఉన్న గుర్రపుడెక్క కూడా ఉప్పుటేరులో కలుస్తుంది. గత కొన్ని నెలలుగా ఈ విధంగా చొచ్చుకువచ్చిన గుర్రపుడెక్క ఉప్పుటేరులో మేట వేసి, మంచినీటిలో పెరుగుతోంది. వేసవిలో సముద్రపు పోటుకు ఉప్పునీరు ఉప్పుటేరు గుండా ఎదురు ప్రవహిస్తుంది. ఈ విధంగా గత కొన్నేళ్లుగా వేసవిలో ఉప్పుటేరులోకి సముద్రపు నీరు కాళ్ల మండలం కలవపూడి, మోడి తదితర ప్రాంతాలకు, భీమవరం రూరల్ మండలం లోసరి వరకూ చొచ్చుకు వచ్చేది. ఆ తరువాతి రోజుల్లో ఉప్పునీటి ప్రవాహం మరింతగా పెరిగి డిసెంబర్, జనవరి నెలల్లోనే ఆకివీడు ఆర్ అండ్ బీ, రైల్వే వంతెన వరకూ చొచ్చుకువస్తుండేది. ఇటీవల కాలంలో సముద్రపు నీరు ఎదురు ప్రవాహం ఏప్రిల్, మే నెలల్లో చొచ్చుకువస్తుంది. దుంపగడప గ్రామం వద్ద ఉన్న జువ్వ కనుమ వరకూ ఈ ఏడాది చొచ్చుకురావడంతో గుర్రపుడెక్క ఉప్పునీటికి చనిపోతుంది. మరో వారం రోజుల్లో చనిపోయిన గుర్రపుడెక్క కుళ్లి పోయి సముద్రం పోటుకు వెనక్కి చొచ్చుకుపోయి సముద్రంలోకి కొట్టుకుపోతుంది. గుర్రపుడెక్క చనిపోయేందుకు మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో పంట, మురుగు కాల్వల్లో తిష్టవేసి రైతుల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. పంట కాల్వల్లో విపరీతంగా పెరిగిపోతున్న గుర్రపుడెక్కను తొలగించేందుకు ఏటా లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. అయినప్పటికీ ఫలితం దక్కడం లేదు. ఉప్పునీరే గుర్రపుడెక్కను అంతమొందించడానికి మార్గంగా ఉంది. సముద్రపు మొగ నుంచి కాళ్ల మండలం ఏలూరు పాడు వరకూ సముద్రపు నీరు పంట కాల్వల్లోకి ఎదురు ప్రవహించి, చొచ్చుకుపోవడంతో కొంత మేర గుర్రపుడెక్క చనిపోతుంది. అయితే గుర్రపుడెక్క చనిపోవడం చూసుకుంటే, రైతులకు మరో ముప్పు ఎదురవుతోంది. సముద్రపు నీరు ఎదురు ప్రవహించే ప్రాంతం వరకూ సాగు భూములు చౌడు భూములుగా మారిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఆయా పంట, మురుగు కాల్వలకు షట్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రంగస్థల చైతన్య పురస్కారాల ప్రదానం


సత్యనారాయణను పురస్కారంతో సన్మానిస్తున్న దృశ్యం

భీమవరం : స్థానిక డీఎన్నార్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో నాలుగు రోజులపాటు నిర్వహించిన చైతన్య భారతి 17వ జాతీయస్థాయి సాంఘిక నాటికల పోటీలు ఘనంగా ముగిశాయి. ముగింపు రోజు అజో విభో కందాళం ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వ్యవస్థాపకుడు అప్పాజ్యోసుల సత్యనారాయణకు రాయప్రోలు రామచంద్రమూర్తి రంగస్థల చైతన్య పురస్కారం, రంగస్థల నటీమణి ఎం రత్నకుమారికి పెనుపోతుల శేషగిరిరావు హార్దిక చైతన్య పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రుద్రరాజు పద్మరాజు, చైతన్య భారతి అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్, పీఆర్‌ఓ భట్టిప్రోలు శ్రీనివాస్, బొండా రాంబాబు, పేరిచర్ల లక్ష్మణ వర్మ, కట్రెడ్డి సత్యనారాయణ, కోట్ల నాని, కాగిత వెంకట రమణ, కృతివెంటి సత్యకుమార్, పెన్నాడ శ్రీనివాస్, వడుపు గోపి, జ్యోతిరాజ్ భీశెట్టి, కనగర్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కుంగిపోతున్న మందపాడు సీసీ రోడ్డు


కుంగిపోతున్న మందపాడు-ఉప్పుటేరు రోడ్డు

ఆకివీడు: స్థానిక ఉప్పుటేరు వంతెన దగ్గర నుంచి మందపాడు వరకూ ఉప్పుటేరు గట్టుపై వేసిన సీసీ రోడ్డు రెండుగా చీలిపోతుంది. సుమారు నాలుగేళ్ల క్రితం సీసీ రోడ్డును నిర్మించారు. సీసీ రోడ్డు మధ్య భాగంలో ఉన్న ఖాళీ ప్రదేశం నుంచి రోడ్డు పంట పొలాల వైపుకు కుంగిపోయింది. ఇటీవల ఆర్ అండ్ బీ అధికారులు రోడ్డు విడిపోయిన భాగంలో తారు వేసి ప్యాచ్ వర్కు చేశారు. అయినప్పటికీ రోడ్డు విడిపోయింది. ఈ ప్రాంతం గుండా ప్రైవేటు గొడౌన్ల నుంచి ఎఫ్‌సీఐకి బియ్యం ఎగుమతులు, దిగుమతులు జరుగుతుంటాయి. వేసవి కాలంలో మట్టి ట్రాక్టర్లు, లారీలు భారీ లోడుతో తిరగడంతో రోడ్డు మరింతగా కుంగిపోయింది. సీసీ రోడ్డు పూర్తిగా పాడైపోతే తాము ఈ ప్రాంతం గుండా ద్విచక్ర వాహనాల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అవకాశం ఉండదని, ఆర్‌అండ్‌బీ అధికారులు తగిన చర్యలు తీసుకుని రోడ్డు రెండుగా విడిపోకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నత్తారామేశ్వరంలో రుద్రరూపంలో రామలింగేశ్వరుడు


నత్తారామేశ్వరంలో గోస్తనీ గర్భంలో రామేశ్వర స్వామి ఆలయం


నత్తారామేశ్వరంలో పరశురామ ప్రతిష్ఠ నిజరూప దర్శనం

పెనుమంట్ర: వైశాఖ మాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని నత్తారామేశ్వరం గ్రామంలోని రామేశ్వరుని దేవాలయం భక్తులతో పోటెత్తింది. ఈనెల 6న పరశురామ ప్రతిష్ఠ రామలింగేశ్వర స్వామి తిరిగి జలదిగ్బంధం కానుండటంతో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు తరలివస్తున్నారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయానికి చేరుకున్న భక్తులు క్యూలైన్లలో నిల్చుని త్రిలింగ క్షేత్రాన్ని నత్తారామేశ్వరంలోని సీతారామ ప్రతిష్ఠ, లక్ష్మణ ప్రతిష్ఠ, పరశురామ ప్రతిష్ఠ చేసిన స్వామివార్లను ఒకే చోట దర్శించుకుని ఆలయ ఆవరణలో దాతలు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ప్రసాదాన్ని స్వీకరించారు. నెల రోజుల పాటు దర్శనమిచ్చే గోస్తనీ నదిలోని శ్రీరామలింగేశ్వరుని దర్శనం ఈనెల 6వ తేదీతో ముగియనుండటంతో రాష్ట్రంలో వివిధ ప్రాంతాలనుంచి భక్తులు వచ్చి దర్శించుకుంటున్నారు. 6న మాస శివరాత్రి కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఇక్కడ అభిషేకాలు చేయించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం నదిలోని పరశురామ ప్రతిష్ఠను గంధంతో స్వామివారిని రుద్ర రూపంగా అలంకరించడంతో భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

చిత్రలేఖనంతో విద్యార్థుల్లో సృజనాత్మకత


వేసవి సెలవుల్లో చిత్రలేఖనంలో పాల్గొన్న విద్యార్థులు

ఆకివీడు: విద్యార్థుల్లో చిత్రలేఖనం ద్వారా సృజనాత్మకత పెంపొందుతుందని ఉపాధ్యాయులు కిషోర్ చెప్పారు. స్థానిక మాదివాడలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా సోమవారం చిత్రలేఖనంపై శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలోచనతో చిత్రాలు గీయడం ద్వారా మెదడుకు పదును పెట్టవచ్చునన్నారు. వివిధ అంశాలపై చిత్రాలు గీయం కూడా ఒక కళేనన్నారు. ఆలోచనా శక్తి ద్వారా సమాజాన్ని మేలుకొల్పే విధంగా చిత్రాలు గీయవచ్చునని వివరించారు. తొలుత విద్యార్థులకు క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. భవిష్యత్, వర్తమాన, చారిత్రక ఘట్టాలపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులతో కోకో, ఇతర క్రీడల్ని ఆడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు పార్వతి పాల్గొన్నారు.

ఘనంగా హనుమద్ జయంతి మహోత్సవాలు

పాలకోడేరు: హనుమజ్జయంతి మహోత్సవాలు సందర్భంగా పెన్నాడలోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో గత మూడు రోజులుగా పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. మంగళవారం తేనెతో అభిషేకాలు, లక్ష పత్రి పూజలు చేశారు. సుమారు 5 వేల మందికి అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

మహిళల సమస్యలపై ఐక్యంగా పోరాడాలి


మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

నరసాపురం: ప్రేమలు, పెళ్లిళ్ల పేరుతో యువతులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఐద్వా రాష్ట్రస్థాయి విజ్ఞాన శిక్షణా తరగతులు సోమవారంతో ముగిశాయి. ముగింపు సభలో రమాదేవి మాట్లాడుతూ కొత్తగా ఏర్పడే ప్రభుత్వాలు యువతులపై జరుగుతున్న దాడులను అరికట్టే కఠిన చట్టాలను అమల్లోకి తేవాలన్నారు. లైంగింక వేధింపుల కేసుల్లో నిందితులకు వెంటనే శిక్షలు పడేలా చట్టాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. మహిళలు సమస్యలపై సంఘటితంగా పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, అధ్యక్షురాలు కేతా పద్మజ, ఎస్.ఉదయకుమారి, బి.శ్యామల తదితరులు పాల్గొన్నారు.